క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపిక


విక్రమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

ముదిగొండ: సూర్యాపేటలో ఈనెల 25, 26వ తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బొడ్డు విక్రమ్ ఎంపికయ్యాడు. ఆయనకు శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. పీఈటీ బి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

27మందిపై బైండోవర్ కేసులు

కారేపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో 27మందిపై కారేపల్లి పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు శనివారం తెలిపారు. నలుగురు రౌడీషీటర్లు, 23మంది వివిధ రాజకీయ పార్టీల నాయకులపై బైండోవర్ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. సింగరేణి సర్కిల్ పరిధిలోని కామేపల్లికి చెందిన కుర్రా సుధాకర్, కారేపల్లి క్రాసు రోడ్డు సరస్వతి స్కూల్ సమీపంలో మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని దగ్గర నుంచి 27మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకునట్లు ఎస్సై తెలిపారు.

మమత మెడికల్ కాలేజీకి శరీరదానం


అంగీకార పత్రాన్ని డాక్టర్ కల్పనకు అందజేస్తున్న రజిత

వైరా: తన మరణానంతరం తన శరీరాన్ని ఖమ్మం మమత మెడికల్ కళాశాలకు అందజేస్తున్నట్లు వైరాకు చెందిన మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత శనివారం శరీరదానం చేస్తున్నట్లు అగ్రిమెంట్ పత్రాలు కళాశాల డాక్టర్ కల్పనకు అందజేశారు. తన పెద్ద కుమారుడు జీ.వీ.రామస్ జన్మదినం సందర్భంగా ఆమె శరీరాన్ని దానం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కల్పన, డాక్టర్ సంగీత, గుడిమెట్ల మోహనరావు, గుడిమెట్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌కు సన్మానం


పాస్టర్ మధుబాబు, కల్యాణి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని పినపాక చర్చిలో ప్రపంచ పాస్టర్ల దినోత్సవం శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సెవెంత్ డే అడ్వంటిస్టు చర్చి పాస్టర్ టి.మధుబాబు సతీమణి టి.కల్యాణిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో తల్లాడ, వైరా మండలంలోని పలువురు పాస్టర్లు, సంఘ పెద్దలు, యవ్వనస్తులు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

జమలాపురంలో టీడీపీ కార్యకర్తల పూజలు


జమలాపురంలో టీడీపీ కార్యకర్తలు

ఎర్రుపాలెం: టీడీపీ నేత నారా చంద్రబాబునాయుడుపై పెట్టిన కేసులు ఎత్తివేసి త్వరగా విడుదల చేయాలని కోరుతూ.. ఏపీ రాష్ట్రం తిరువూరు మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం అక్కడ నుంచి పాదయాత్రగా జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కమిటీ అధ్యక్షులు దోమందల సామేలు, పిట్టా చైతన్య, డేవిడ్ రాజు వేముల వెంకటేశ్వరరావు, బొగ్గుల సత్యనారాయణరెడ్డి, పద్మ, పూర్ణచంద్రారెడ్డి, కొర్లపాటి శ్రీనివాసరావు, వీరమాచినేని వెంకట కృష్ణారావు, పొన్నెబోయిన నాగేశ్వరావు, వాసం మునియ్య శ్రీలక్ష్మి, ఏలియా బాబు తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క పూలతో బతుకమ్మ..

పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ(ఎంగిలిపూల బతుకమ్మ) పండగను శనివారం మహిళలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఉదయమంతా తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేసి సాయంత్రం వేళ ఆలయాలు, జలాశయాల వద్దకు తీసుకొచ్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆట, పాటలతో సందడి చేశారు. తొలిరోజు నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించి ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జీవించేలా దీవించాలని వేడుకుని సమీప ప్రాంతాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా: సాయిబాబా ఆలయం వద్ద బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు


సత్తుపల్లిటౌన్: డాక్టర్ కేకేఆర్ పాఠశాలలో..


కొణిజర్ల: మల్లుపల్లి బీసీ కాలనీలో బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న మహిళలు


మధిర: లడక్‌బజార్‌లో బతుకమ్మ సంబురాలు


సత్తుపల్లిరూరల్: వాణి విద్యాలయంలో..


చింతకాని: నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో..


సత్తుపల్లి విశ్వశాంతిలో..

బతుకమ్మ ప్రత్యేకం..

- బంతి పూలకు పెరిగిన డిమాండ్
- బతుకమ్మ సందర్భంగా రేటు పెంచిన యజమానులు


బంతితోటలో పూలు కోస్తున్న కూలీలు


పల్లిపాడులో బంతిపూలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కొణిజర్ల: బతుకమ్మ వేడుకలు మొదలైన సందర్భంగా బంతిపూలకు యమ డిమాండ్ పెరిగింది. మండలంలోని కొణిజర్ల, పల్లిపాడు, తనికెళ్ల, అమ్మపాలెం, గుబ్బగుర్తి తదితర గ్రామాల్లో బంతిపూలు సాగు చేస్తున్నారు. శనివారం నుంచి బతుకమ్మ సంబరాలు మొదలైనందున జిల్లా నలుమూలల నుంచి వ్యాపారులు, సామాన్యులు వచ్చి బంతిపూలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో బంతిపూల తోటల యజమానులు రేటు అమాంతం రెట్టింపు చేశారు. గత వారం రోజుల వరకు కిలో రూ.40 నుంచి రూ.50 అమ్మిన బంతిపూలు శనివారం కిలో రూ.60 నుంచి రూ.80 వరకు అమ్మారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి కూడా వ్యాపరులు వచ్చి క్వింటాల కొద్ది బంతిపూలు తీసుకుపోతున్నారు. ఏకంగా తోటలనే పూర్తిగా కొనుగోలు చేసి మనుషులతో పూలు కోయించుకుని పోతున్నారు. దీంతో వ్యాపారం బాగుందని తోటల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పల్లిపాడులో బంతిపూలు బస్తాల్లో నింపుతున్న కూలీలు


రోడ్డు పక్కన అమ్ముతున్న బంతిపూలు

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

సత్తుపల్లి: తల్లాడ నుంచి సత్తుపల్లి వరకు 135 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రభుత్వంపై ప్రజలు మార్పు కోరుతున్నారని కాంగ్రెస్ నేత కొండూరు సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో.. పాదయాత్రలో వచ్చిన సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన డబుల్‌బెడ్‌రూం హామీలను నెరవేర్చకపోవటం వల్ల చాలాచోట్ల పక్కా ఇళ్లు కావాలని, నోటిఫికేషన్లు తరచూ వాయిదా వేయటం వల్ల నిరుద్యోగుల్లో నిరాశ నెలకొందని, రేషన్‌కార్డులు ఇవ్వలేదని, పెన్షన్ సరిగా రావటం లేదని ప్రజలు చెప్పారన్నారు. గృహలక్ష్మి, బీసీబంధు, దళితబంధు పథకాలన్ని జీఓలకే పరిమితమయ్యాయన్నారు. విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ సమస్యను పరిష్కరించటంలో విఫలమయ్యారన్నారు. రూ.100 కోట్లు కేటాయిస్తే సమస్యను పూర్తిగా తొలగించవచ్చన్నారు. సత్తుపల్లి జిల్లాను సాధిస్తామని చెప్పి.. ఎన్నికల్లో గెలిచి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు సుధాకర్

అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత విస్మరించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సత్తుపల్లి జిల్లాను ఇస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో బూటకపు హామీలతో వస్తున్నారని, ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, మందపాటి ముత్తారెడ్డి, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, ఉతనేని అప్పారావు, మలిరెడ్డి మురళీరెడ్డి, వెంగళ సురేష్, కె.కోటేశ్వరరావు, రవీంద్రారెడ్డి, మాగంటి శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే అమలు చేస్తాం

వేంసూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. శనివారం భీరపల్లి, మొద్దులగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీనవర్గాలు, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భీరపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డులతో మట్టా దయనంద్, నాయకులు

'సాయిస్ఫూర్తి'లో ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలికారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి మాట్లాడుతూ..ఒకరికొకరికి స్నేహభావం కలగాలనే ఉద్దేశంతో ప్రతీ ఏడు ఫ్రెషర్స్ డే పార్టీని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: పట్టణంలోని టౌన్–2 ఫీడర్ మరమ్మతులు, చెట్ల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్–2 ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, ద్వారకాపురి కాలనీ, రఘురాం ఆస్పత్రి వీధి, అయ్యగారిపేట రోడ్, జూపల్లిరోడ్, కల్పతరురోడ్, అవిని వెంచర్, రామాలయంరోడ్ ప్రాంతాలలో వినియోగదారులు విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి సహకరించాలని కోరారు.

గీతా మందిరంలో అన్నదానం


ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీ గీతాజ్ఞాన మందిరంలో గల పార్థసారథిస్వామి వారికి శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోడే వెంకటనారాయణ, పద్మావతి దంపతులు, బాలలీలాకృష్ణ, విజయలక్ష్మి, మందలపు రామారావు, లలిత, తాటికొండ వెంకటేశ్వరరావు, ఝాన్సీరాణి, కనిగళ్ల గోపాలకృష్ణల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏపూరి పురుషోత్తం, రాఘవయ్య, గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, సత్యావతి, లక్ష్మి పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు సర్వం సిద్ధం


శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయం

సత్తుపల్లిటౌన్: స్థానిక జ్ఞానసరస్వతీదేవి ఆలయం, రాజీవ్‌నగర్‌లోని శ్రీవిజయదుర్గాదేవి ఆలయం, దసర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని శ్రీప్రసన్న గణపతి ఛారిటబుల్ ట్రస్ట్ మండపం, శ్రీకోదండ రామాలయం, శ్రీకృష్ణమందిరం, వెంగళరావునగర్‌లోని శ్రీభ్రమరాంభికాసమేత ఆలయం, శ్రీసంతోషిమాతా ఆలయంలో దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఆలయాల్లో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వనున్నారు.

కారేపల్లి: దసరా పర్వదినాన్ని పురష్కరించుకోని, నేటి నుంచి ప్రారంభం అయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. కారేపల్లిలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం, శ్రీ విఘ్నేశ్వర విశ్వేశ్వర సీతారామాంజనేయస్వామి (శివాలయం) ఆలయంతోపాటు, కారేపల్లి మెయిన్ రోడ్డు శ్రీ శ్రీనివాస బుక్‌స్టాల్ ప్రక్కన దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా మండపాలను సిద్ధం చేస్తున్నారు.


మండపం వద్ద ఏర్పాట్లు చేస్తున్న భక్తులు

మరోసారి ఆశీర్వదించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

కల్లూరురూరల్: తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన తనను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు మండలంలోని ఎర్రబంజరు, బత్తులపల్లి, కప్పలబంధం, లక్ష్మీపురం(రాళ్లబంజరు) గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజలను మోసగించేందుకు అబద్ధపు హామీలతో కొందరు వస్తారని.. జాగ్రత్తగా ఉండాలన్నారు. గిరిజనులకు 6శాతం నుంచి 10 శాతానికి రిజర్వేషన్ పెంచిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పెద్దలచ్చిరాం, సత్యనారాయణరెడ్డి, నందిగామ ప్రసాద్, ఎంపీపీ బీరవెల్లి రఘు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, సొసైటీ చైర్మన్ బొబోలు లక్ష్మణరావు, నాయకులు రామకృష్ణ, మేకల కృష్ణ, దార్ల నర్సింహారావు, ఎస్‌కె కమ్లి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


ఎర్రుపాలెం: వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ గణేష్, సీఐ వసంత్‌కుమార్

ఎర్రుపాలెం: ఎన్నికల కోడ్‌లో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఆర్డీఓ గణేష్ సూచించారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్దకు చేరుకున్న పలు వాహనాలను స్వయంగా చెక్ చేశారు. మధిర సీఐ వసంత్‌కుమార్, ఉషాశారద, ఎస్సై ఎం.సురేష్‌లతో ఆయన మాట్లాడారు. అనుమానస్పద వాహనాలను ఏ మాత్రం వదలొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవి తదితరులు ఉన్నారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న వైరా సీఐ సాగర్

రామకృష్ణాపురంలో వాహనాల తనిఖీ..

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం బస్టాండ్ సెంటర్ వద్ద ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై వైరా సీఐ సాగర్ ఆధ్వర్యంలో చింతకాని పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావలిలో భాగంగా వాహనాల తనిఖీని చేపడుతున్నామని.. కావున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావలిని అనుసరించాలన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా రూ.50 వేలు కంటే అదనంగా నగదు తీసుకెళ్లకూడదన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాజేందర్, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ గుంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనంతలక్ష్మికి నివాళి

ముదిగొండ: మండల పరిధిలోని పెద్దమండవలో వార్డుసభ్యురాలు అనంతలక్ష్మి(42) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వీరభద్రం, నాయకులు పందిరి అంజయ్య, తిరుపతిరావు, నాగరాజు, నాగేశ్వరరావు, వేణులు శనివారం సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు వారు సానుభూతి తెలిపారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

కారేపల్లి: తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని ప్లకార్డులతో తెలంగాణ ఉద్యమకారులు కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణతల్లి విగ్రహవద్ద శనివారం ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణతల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు సోమందుల నాగరాజు, తోటమళ్లసాయి, జూపల్లి రాము, దామళ్ల నాగరాజు, మహబూబ్ పాల్గొన్నారు.


తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

చి'వరి'కి ఇలా..


వాటర్ ట్యాంకర్‌తో వరికి నీరు అందిస్తున్న రైతు

వేంసూరు: మండలంలో నాగార్జున సాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న వరి ప్రస్తుతం పొట్ట, ఈనక దశలో ఉంది. ఈ తరుణంలో సాగు నీటి ఎద్దడితో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. సాగర్ జలాలు విడుదల చేసినా.. ఆ నీరు కాలువ అడుగు భాగంలో ఉండి పొలాలకు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటుగా అప్రకటిత విద్యుత్ కోతలతో బోర్ల కింద పంటలు సైతం చేతికందే పరిస్థితి లేకపోవడంతో మండలంలోని కుంచపర్తి గ్రామానికి చెందిన పలువురు రైతులు వాటర్ ట్యాంకర్లతో తమ వరి పొలాలకు నీరు అందిస్తూ.. పంట ఎండకుండా కాపాడుకుంటున్నారు.